ప్రజాశక్తి

శనివారం 23 సెప్టెంబర్ 2023 5

పార్వతీపురం మన్యం

ఎంపిడిఒల నూతన కార్యవర్గం

పార్వతీపురం : ఉమ్మడి జిల్లాల మండల అభివృద్ధి అధికారుల సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా కె.రాజ్‌కుమార్ (సిఇఒ), అధ్యక్షులుగా శంబంగి రామకృష్ణ (తెర్లాం ఎంపిడిఒ), ఉపాధ్యక్షులుగా సాల్మన్‌రాజు (గుమ్మలక్ష్మీపురం ఎంపిడిఒ), ప్రధానకార్యదర్శిగా కె.రామకృష్ణ రాజు (చీపురుపల్లి ఎంపిడిఒ), సంయుక్త కార్యదర్శిగా రమాదేవి (సాలూరు ఎంపిడిఒ), బిఎస్‌కె. పట్నాయక్ (వేపాడ ఎంపిడిఒ), కోశాధికారిగా కె శేషుబాబు (ఎస్.కోట ఎంపిడిఒ), నియోజకవర్గ సమన్వయకర్తలుగా కురుపాం: శివరామప్ప (కురుపాం ఎంపిడిఒ), పార్వతీపురం : విజయలక్ష్మి (బలిజిపేట ఎంపిడిఒ), సాలూరు పి.త్రివిక్రమరావు (మెంటాడ ఎంపిడిఒ), బొబ్బిలి రమామణి (రామభద్రపురం ఎంపిడిఒ, రాజాం: జివి రవికుమార్ (సంతకవిటి ఎంపిడిఒ) చీపురుపల్లి :బి గొర్లె భాస్కరరావు (గరివిడి ఎంపిడిఒ), నెల్లిమర్ల: డిడి స్వరూపరాణి (డెంకాడ ఎంపిడిఒ), విజయనగరం: జి గిరిబాల (విజయనగరం ఎంపిడిఒ), ఎస్ కోట : పద్మజ (ఎల్‌కోట ఎంపిడిఒ), గజపతినగరం: కె.కిశోర్‌కుమార్ (గజపతినగరం ఎంపిడిఒ) ఎన్నికయ్యారు.

ఇక్కడ పుట్టడమే పాపమా?

రిజర్వేషన్లకు దూరమైన నాన్ షెడ్యూల్డ్ గిరిజనులు

అభివృద్ధికి నోచుకోని దుడ్డు ఖల్లు గిరిజన గ్రామం

షెడ్యూల్డ్ జాబితాలో చేర్చాలి

దుడ్డుఖల్లు పంచాయతీ నాన్ షెడ్యూల్డ్ గ్రామంగా ఉండడంతో రాజ్యాంగం కల్పించిన హక్కులు గిరిజనులకు అందడం లేదు. ప్రభుత్వ ఉద్యోగానికి రిజర్వేషన్ దూరమైంది. అనేక ఏళ్ల నాటి సమస్యను ప్రభుత్వం గుర్తించి షెడ్యూల్డ్ పరిధిలోకి తీసుకొస్తే యువత, మహిళలు, రైతులకు అభివృద్ధికి అవకాశం ఉంటుంది.

పి.తిరుపతి రావు
సిపిఎం మండల నాయకులు,

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇక్కడ గిరిజనులుగా పుట్టడమే పాపమా... రాజ్యాంగం కల్పించిన హక్కులు పొందలేకపోవడమే వీరి శాపమా... అందుకు కారణం ఆ పంచాయతీ నాన్ షెడ్యూల్డ్ గ్రామంగా ఉండటమే. వివరాల్లోకి వెళ్తే ..

మండలం నూటికి నూరు శాతం ఏజెన్సీ ప్రాంతం. అయినప్పటికీ దుడ్డుఖల్లు పంచాయతీ మాత్రం అందుకు భిన్నం. నాన్ షెడ్యూల్డ్ పంచాయతీగానే పరిగణించబడింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఈ పంచాయతీలో నివసిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి రాయితీలు గానీ, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలకు రిజర్వేషన్లు గానీ వర్తించడం లేదు. ఐటిడిఎ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న వ్యవసాయ రుణాలు, బోరు బావులు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు, అందడం లేదు .దుడ్డు ఖల్లు పంచాయతీలో 15 గ్రామాలు ఉన్నాయి. వీటిలో కొత్తవలస, బెల్లిడి, దొరజమ్ము, కంబగూడ, దొరకెక్కువ, కొల్లిగూడ, లోవలక్ష్మీపురం, విశ్వనాధపురం, దుడ్డు ఖల్లు, బుడ్డెంఖర్జ, మేదరగండ, పిల్లి గూడ, బొడ్లగూడ, చింతలపాడు గిరిజన గ్రామాలు నాన్ షెడ్యూల్డ్ గ్రామాలుగానే పరిగణించబడుతున్నాయి. నాన్‌షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ జాబితాలో చేర్చాలని ఎన్నోసార్లు ప్రభుత్వానికి అధికారులకు విన్నవించినా ఆ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో పై గ్రామాల్లో నివసిస్తున్న వారు గిరిజనులుగా ఉన్నా రిజర్వేషన్ల ప్రక్రియ వీడిదరి చేరడం లేదు. దీంతో చదువుకుని ఉన్న గిరిజన యువత నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు. గిరిజన రైతులకు ఎటువంటి వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ రాయతీలు అందక ప్రతి ఏటా అప్పులు చేసి పంటలను పండిస్తున్నారు. పంటలకు నష్టం వాటిల్లినా ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారం అందడం లేదు. పక్కా గృహాలు లేవు. తాగునీటి సమస్య వెంటాడుతుంది. 1/70చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం వీరికి వర్తించదు.

ఉపాధి అవకాశాలు లేవు ...

మా గ్రామం నాన్ షెడ్యూల్డ్ గ్రామంగా ఉండడంతో ఇక్కడ చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు కోల్పోతున్నాం. నేను డిగ్రీ చదువుకున్నా రిజర్వేషన్ లేక ఉద్యోగం రాక నిరుద్యోగిగా ఉన్నాను. ప్రభుత్వం స్పందించి మా గ్రామాన్ని షెడ్యూల్డ్ జాబితాలో చేర్చాలి.

బిడ్డిక సంధ్యశ్రీ
గిరిజన యువతి,
దుడ్డుఖల్లు.

ప్రభుత్వ రాయతీలకు దూరం :...

దుడ్డుఖల్లు పంచాయతీ నాన్ షెడ్యూల్డ్‌గా ఉండడంతో ఈ పంచాయతీలో ప్రజలు ప్రభుత్వ రాయితీలకు దూరంగా ఉన్నారు. ఐటిడిఎ ద్వారా ఎటువంటి రుణాలు అందడం లేదు. దీంతో పూర్తిగా వెనుకబడి ఉన్నాం. ఇక్కడ పుట్టడమే పాపమా?.

కొండ గొర్రి గోపాలరావు,
గిరిజన యువకుడు,
దుడ్డుఖల్లు.

జిపిఎస్‌ను అంగీకరించేది లేదు

బైకు జాతాలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి - కలెక్టరేట్

తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను తీసుకొస్తానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు జిపిఎస్ తీసుకురావడమంటే ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసగించడమేనని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ విమర్శించారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా రాష్ట్ర ప్రచార జాతా శుక్రవారం పార్వతీపురం చేరుకుంది. ఈ జాతానుద్దేశించి ప్రసాద్ మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50ఏళ్లలో ఉపాధ్యాయుల సంక్షేమానికి, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయులను ఐక్యపర్చేందుకు ఎంతో కృషి చేసిందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజా, ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ యుటిఎఫ్ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహలతో పని చేస్తుందన్నారు. అందుకే ఉపాధ్యాయులంతా యుటిఎఫ్‌ను ఆదరిస్తున్నారని అన్నారు. ఈ జాతా ఈనెల 29వరకు జరుగుతుందని, అక్టోబరు 1న విజయవాడలో 10వేల మందితో స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఈ సభను జయప్రదం చేయాల్సిందిగా వారు కోరారు. ఈ జాతా పార్వతీపురంలో భాస్కర్ కాలేజ్ నుంచి బైక్ ర్యాలీతో ప్రారంభమై స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద గల యుటిఎఫ్ పతాక ఆవిష్కరణతో ముగిసింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి.రమేష్, సహాధ్యక్షులు కె.విజయకుమార్, వి.జ్యోతి, ట్రెజరర్ కె.మురళి, జిల్లా కార్యదర్శులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతంపేటలో ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

పార్వతీపురంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట : యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సంబరాల్లో భాగంగా చేపట్టిన బైకు ర్యాలీ సీతంపేట చేరుకుంది. సిఐటియు కార్యాలయం ఆవరణలో సీనియర్ నాయకులు పి.పద్మశ్రీ యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల లోగాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి అక్టోంబర్ 1 వరకూ బైక్ జాతా జరుగుతుందన్నారు. అనంతరం అక్టోబర్ 1న విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సంబరాలకు ఉపాధ్యాయులంతా పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజు, ఎస్.మురళీమోహనరావు, రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాష్, జిల్లా కార్యదర్శి కె.కష్ణారావు, మండల ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారావు, మండల అధ్యక్షులు కె.సింహాచలం, గౌరవ అధ్యక్షులు పి.నారాయుడు, సీనియర్ నాయకులు ఎ.ప్రకాశం, బి.జయప్రకాష్, ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు

రసాయన పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గంగరేగువలస పంచాయతీలో గల రసాయన ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గంగరేగువలస పంచాయతీ చిన్న పలుకువలస రెవెన్యూ పరిధిలో జంఝావతి డ్యాం సమీపంలో ఏర్పాటు చేసిన కెమికల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ రైతులు నిరసన తెలిపారు. కెమికల్ ఫ్యాక్టరీ ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని, నష్టాన్ని రైతులు వివరించారు. ఈ సందర్భంగా రైతులు ఎం.వెంకటనాయుడు, ఎం.సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ రైతుల అనుమతులు, అభిప్రాయ సేకరణ జరగకుండా కెమికల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి గత నాలుగేళ్లుగా పురుగుల మందులు రసాయనాలు తయారు చేస్తున్నారని తెలిపారు. దీంతో పంట పొలాలకు నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దుర్వాసనకు పొలం పనులు చేసేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పక్కనే ఉన్న చెరువుల్లోనూ ఫ్యాక్టరీ వ్యర్థాలు, చెత్తాచెదారం పడేయడంతో చెరువుల్లో నీరంతా కలుషితమవుతుందని అన్నారు. చెరువు ఆయకట్టు సుమారు 40 ఎకరాల వరకు నీరు కలుషితమవ్వడంతో పంటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. కనీసం ఆ నీటితో పండిన పంటలు తినే పరిస్థితి లేదన్నారు. కొన్ని మందుల తయారీకి అనుమతులిచ్చినప్పటికీ వారు అక్రమంగా అనేక రకాల మందులు తయారు చేసి పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని రైతుల ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు పరిశీలించి ఫ్యాక్టరీ అనుమతులు రద్దుచేసి ఈ ప్రాంత రైతులను కాలుష్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మరిశర్ల సింహాచలం, అల్లు శంకర్రావు, కందులపాటి సాయిబాబా, మరిశర్ల వెంకటనాయుడు, శెట్టి శ్రీరామ్, సత్యనారాయణ, పెద్ద సింహాచలం, డొంకాడ శంకర్రావు. డొంకాడ హరి పాల్గొన్నారు.

ప్రజల ఇంటి ముంగిటకే వైద్య సేవలు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజల ఆరోగ్య పరిరక్షణే పరమావధిగా, ఇంటి ముంగిటకే వైద్య సేవలను అందించే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సిఎం జగన్ రూపొందించారని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రెండు జిల్లాల పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలతో జెడ్‌పి సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, పింఛన్లు, ప్రాధాన్యతా భవనాల నిర్మాణం, గడపగడపకు మన ప్రభుత్వం, వాలంటీర్ల ఖాళీలు, పంచాయతీరాజ్ శాఖ కార్యక్రమాలపై సమీక్షించారు. ఆయా అధికారుల ద్వారా సంబంధిత ప్రగతి నివేదికలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 30 నుంచి ప్రారంభమయ్యే ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. సుమారు 105 రకాల మందులను ఉచితంగా అందించి, 14 రకాల వైద్య పరీక్షలను శిబిరాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డుల్లో పొరపాటున వయసు తక్కువగా నమోదైన వారు దరఖాస్తు చేసుకొంటే, వారికి మెడికల్ బోర్డు ద్వారా వయసు నిర్ధారించి, అర్హత ఉన్నవారికి పింఛను మంజూరు చేస్తామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంతో సహా అన్ని ప్రభుత్వ భవనాలు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని కోరారు. ఇంజినీరింగ్ సహాయకుల సేవలను వినియోగించుకోవాలని, బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. నిధులకు ఎక్కడా ఇబ్బంది లేదని తెలిపారు. వాలంటీర్ల ఖాళీలను ప్రతీవారం భర్తీ చేయాలని ఎంపిడిఒలను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. వారంలో కనీసం మూడు రోజులపాటు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ధాన్యం రవాణా వాహనాలకు జిపిఎస్ తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వం సేకరించిన ధాన్యం రవాణా చేసే వాహనాలకు జిపిఎస్ తప్పనిసరని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. ధాన్యం రవాణా చేసేందుకు సంబంధిత రవాణా యాజమాన్యాలతో కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ 2023 - 24 సీజనుకు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానున్న దృష్ట్యా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతు కళ్లాల నుంచి లేదా ప్రభుత్వం నిర్దేశించిన ప్రదేశం నుంచి ఎంపిక చేసిన మిల్లుకు వెంటనే తరలిస్తామనిచెప్పారు. దీనికి సొంత వాహనాలు కలిగిన యజమానులు లేదా రైతులు తమ వాహనాలను వినియోగించవచ్చుని, ఆ వాహనాలకు వాటి యజమానులే జిపిఎస్ పరికరాలను అమర్చుకోవాలని స్పష్టం చేశారు. జిపిఎస్ ఉన్న వాహనదారులు మాత్రమే ధాన్యం రవాణాలో పాల్గొనేందుకు అర్హత పొందుతారని ఆయన పేర్కొన్నారు. వాహన యజమానులు తమ వాహన వివరాలను జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయములో సమర్పించి, వివరాలను అక్టోబరు 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. అటువంటి వాహనాలను పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రంగా గుర్తించి, ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఆర్‌బికెల వారీగా వాహనాల వివరాలు అందించాలని ఆయన ఆదేశించారు. ధాన్యం సేకరణకు ప్రధానంగా అవసరమగు గోనె సంచులు సిద్ధం చేస్తున్నామని, కోనుగోలు కేంద్రాల్లో సిబ్బందిని నియమించుటకు నోటిఫికేషన్ జారీ చేశామని, త్వరలో నియామకం పూర్తి చేస్తామని చెప్పారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవుళ్ల నాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 3 నుండి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నామని అన్నారు. రవాణా అసోసియేషన్ అధ్యక్షులు రమణ మాట్లాడుతూ గ్రామాల మధ్య దూరం పక్కాగా లెక్కించాలని, బిల్లులు చెల్లింపు వేగవంతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా రవాణా అధికారి సి మల్లిఖార్జున రెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్ రక్షణ యాత్ర జయప్రదానికి ప్రచారం

ప్రజాశక్తి -బెలగాం

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవడానికి సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్తరాంధ్ర బైక్ యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక వాసవీ కాలేజీతో పాటు వివిధ విద్యాసంస్థల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వి.ఇందిర, జి.వెంకటరమణ బిజెపి ప్రభుత్వం ఉక్కు కర్మాగారంపైన అనుసరిస్తున్న వైఖరిని వాడవాడలా ప్రజలకు తెలియజేసేందుకు సిపిఎం బైక్‌ర్యాలీ చేపట్టిందన్నారు. ఉత్తరాంధ్రవాసులు స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఇప్పటికే పలు రూపాల్లో ఆందోళన చేస్తున్నారని, ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు ఈనెల 20నుంచి 29 వరకూ సిపిఎం ఆధ్వర్యాన బైక్ ర్యాలీ చేపట్టిందన్నారు. ఈ ఇందులో భాగంగా ఈనెల 23,24 తేదీల్లో రానుందన్నారు. ఇందులో 24న స్థానిక ఆర్‌టిసికాంప్లెక్స్ వైయస్సార్ విగ్రహం దగ్గరజరిగే సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు, బి.సూరిబాబు, డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

గుమ్మలక్ష్మీపురం : విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం చేపడుతున్న ఉక్కు రక్షణ యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ కోరారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలో గోడపోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బిడ్డిక శంకరరావు, బిడ్డిక ఆడిత్తు, ఎం.సన్యాసిరావు, పి.మోహన్‌రావు ఉన్నారు.

పాలకొండ : విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకై చేపడుతున్న బైక్ యాత్ర శనివారం పాలకొండ రానుందని, దీన్ని విజయవంతం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ దావాల రమణారావు కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను పట్టణంలో ఇంటింటికి పంపిణీ చేశారు.

సీతానగరం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన బైక్ ర్యాలీ జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని బూర్జ, నిడగళ్లులో ఈనెల 24న జరిగే బైక్ యాత్రను, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో నాయకులు కళ్యాణ్, నాని, బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

'జగనన్నకు చెబుదాం'కు 97 అర్జీలు

ప్రజాశక్తి - మక్కువ

కలెక్టర్ నిశాంత్ కుమార్ నేతృత్వంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండలస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 97 అర్జీలు అందాయి. అర్జీదారుల నుంచి కలెక్టరేట్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, డిఆర్ఒ కె.హేమలత ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, ఇపిడిసిఎల్ సంబంధిత సమస్యలపై ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందుతున్న వినతులు పట్ల శ్రద్ధ వహించి, తక్షణ పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. స్వీకరిస్తున్న అర్జీలకు పక్కాగా పరిష్కారం ఉండాలని ఆయన స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన పలు వినతులు ఈ విధంగా ఉన్నాయి.

మండలంలోని పనసభద్రకు చెందిన దీసరి చిన్న తమ గ్రామంలో పెద్ద విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఖయిరువలస, పీడ్లవలస, సెంగంవలస గ్రామాల్లో తమ తాతకు భూములున్నాయని, ఆయన వారసుల్లో ఇద్దరు జీవించి ఉన్నారని వారిలో ఒకరు మొత్తం భూములు పంపకం చేయడం లేదని, ఆస్తుల పంపకం గూర్చి అడిగితే దాడులు చేస్తున్నారని, న్యాయం చేయాలని కోరుతూ ఖయిరు వలసకు చెందిన వెన్నెల నాగేశ్వర రావు, ఈశ్వర రావు ఆర్జీని సమర్పించారు. దబ్బగెడ్డకు చెందిన ఇప్పాకుల మురళి తమ భూ సమస్య పరిష్కారించాలని, ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరారు. మార్కొండపుట్టుకు చెందిన అల్లు గౌరునాయుడు పాస్ బుక్ మంజూరు చేయాలని వినతి పత్రాన్ని సమర్పించారు. ఇదే గ్రామానికి చెందిన బొంగు పాప తనకు మూడో విడత ఇంటి బిల్లు మంజూరు చేయాలని కోరారు. సన్యాసిరాజుపురంకు చెందిన బొత్స ప్రకాష్ పింఛను మంజూరు చేయాలని ఆర్జీని సమర్పించారు. శాంతపురంకు చెందిన పాటూరు రవణమ్మ భూ సమస్య పరిష్కరించాలని కోరారు. బందలుప్పికి చెందిన మత్స శివ అనువంశికంగా వస్తున్న భూమిని ఇతరులు ఆక్రమించారని, సమస్యను పరిష్కరించాలని కోరారు. పెదబంటుకు చెందిన వై.అన్నపూర్ణమ్మ తన భూమి ఆక్రమణకు గురైందని, సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. మడవలసకు చెందిన మెళ్లక కుసుమ తమ గ్రామంలో వ్యవసాయ బావి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. లక్ష్మీపురంకు చెందిన తంగుడు సుజాత పాసు పుస్తకం సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వ్యూపాయింట్‌ను పరిశీలిస్తున్న పిఒ కల్పనాకుమారి

అడలి వ్యూపాయింట్ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -సీతంపేట

అడలి వ్యూ పాయింట్ పనులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. శుక్రవారం వ్యూపాయింట్ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యూ పాయింట్ పనుల ప్లానింగ్‌లో ఎటువంటి మార్పులు చేయకూడదన్నారు. కార్యక్రమంలో జెఇ నాగభూషన్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, పట్టణ నాయకులు టి.రాముడు, టి.శంకరరావు ఆధ్వర్యాన కార్మికులు ఆందోళన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మృతి చెందిన కార్మికులు బి.గంగరాజు, బి.శంకరరావు, టి.నాగరాజు, బాబూరావు స్థానంలో ఖాళీ అయిన పోస్టుల భర్తీకి సంబంధించి వారి కుటుంబ సభ్యులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. పెరిగిన పట్టణ జనాభా దృష్ట్యా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు సబ్బులు, నూనెలు, చెప్పులు పంపిణీ చేయాలని కోరారు. విధి నిర్వహణలో ఉన్న కార్మికులు మరణిస్తే జీవో ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. అర్హులైన కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం కమిషనర్ జయరాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా కార్యదర్శి టి.ఇందూ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సైన్స్ సెమినార్‌లో విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో మిల్లెట్స్ వినియోగంపై పలు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను తెలియపరిచారు. ఇందులో భాగంగా స్థానిక కస్తూరిబా పాఠశాలకు చెందిన ఎల్.హారిక మొదటి బహుమతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తులాల సుష్మ ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించనున్న సైన్స్ సెమినార్‌కు ఎంపికైనట్లు ఎంఇఒ చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థుల ప్రతిభను చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 బి. జనార్దన్ నాయుడు, పాఠశాల హెచ్‌ఎం భీముడు, సీఆర్పీలు చిరంజీవి, మన్మధరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బాలికల మానసిక పరిపక్వతపై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికల మానసిక అభివృద్ధికి కళాశాల ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కిషోర్ స్వచ్ఛత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం ఆడాల్ సెంట్ హెల్త్ కౌన్సిలర్ ప్రమీల మాట్లాడుతూ బాలికలు మానసిక అభివృద్ధి, పరిపక్వత ఎలా పెంపొందించుకోవాలనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విభిన్న వయస్సులకు చెందిన మహిళలు ఏ రీతిగా ఆలోచిస్తారో, వారికి వచ్చిన సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలో విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.శ్రీవరం, కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ త్రినాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నర్సిపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నర్సిపురంలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్ జ్వర పీడతలు, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఒ.శాంత కుమారి, ఎఎన్‌ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

26న వాహనాల వేలం

ప్రజాశక్తి - సీతంపేట

నాటుసారా అక్రమంగా రవాణా చేసి పోలీసులకు పట్టుబడిన వాహనాలకు ఈ నెల 26న స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు సమక్షంలో వేలం వేయబడునని ఎస్సై ఏ నీలకంఠరావు తెలిపారు. ఆసక్తిగలవారు వేలంపాటలో పాల్గొనవచ్చు అని తెలిపారు

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ జి.పైడితల్లి తెలిపారు. ఎంపిపి ఉరిటి రామారావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు హాజరకానున్నారని తెలిపారు. కావున సభ్యులు, అన్నిశాఖల అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఇళ్ల పరిసరాల్లో ఉన్న చెత్తను తొలగిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

దోమల నివారణలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - సీతానగరం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, దోమల వ్యాప్తిని నివారించే దిశగా అందరూ భాగస్వాములు కావాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని కోటసీతారాంపురంలో డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండడానికి ఆస్కారం ఉన్నా, పాడైన వస్తువులు, కొబ్బరి బొండాలు, ఉపయోగంలో లేని రుబ్బురోళ్లు, ప్లాస్టిక్ వస్తువులు, కుండీలు, టైర్లు మొదలగు వాటిని సిబ్బందితో కలిసి పరిశీలించి, నివారణ చర్యలు చేపట్టారు. గ్రామంలో జ్వరాలు ఏమైనా ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమల వ్యాప్తి తగ్గి, ప్రజలు రోగాల బారిన పడకుండా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది శాంతమ్మ, దివ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనానికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక అంబేద్కర్ స్మారక భవనం నిర్మాణానికి కోటి రూపాయల నిధులు మంజూరు చేయాలని కోరుతూ రిపబ్లికన్ పార్టీ నాయకులు గొంప ప్రకాశరావు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున కి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం అమరావతిలో డిప్యూటీ సిఎం రాజన్నదొరతో కలిసి ఆయన మంత్రికి వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణానికి అవసరమైన స్థలం ఉన్న దృష్ట్యా నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ ఉన్నారు.

ఆర్‌ఐటిఐలో నాలుగో విడత కౌన్సిలింగ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి రెసిడెన్షియల్ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో శుక్రవారం నాల్గవ విడత కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌కు కురుపాం, జియమ్మ వలస, పార్వతీపురం వంటి దూరప్రాంతాల నుంచి 40 మంది విద్యార్థులు హాజరు కాగా, 29మందిని చేర్చుకున్నట్టు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. డ్రెస్ మేకింగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర బృందం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో వివిధ గ్రామాల్లో శుక్రవారం ఉపాధి హామీ రాష్ట్ర బృందం పనులు పరిశీలనలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన పనులను శుక్రవారం పరిశీలించారు. బృందం సభ్యులు కె.సునీల్, కె.జానకిరావు మండలంలోని ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా చినగుడబలో గతంలో రహదారికి ఇరువైపులా వేసిన మొక్కలను పరిశీలించారు. అలాగే గొట్టివలసలో ఉపాధి హామీ నిధులతో పెంపకం చేపట్టిన పండ్ల తోటలను పరిశీలించారు. తోటపల్లిలో స్కూలుపై నుంచి వచ్చే వర్షం నీరు ఇంకుడు గుంతలో ఇంకేలా నిర్మాణం చేపట్టిన పనులను పరిశీలించి సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారని ఎపిఒ గౌరీనాధ్ తెలిపారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం సభ్యులు

ఇంటి వద్దే వైద్య పరీక్షలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - మక్కువ

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్దనే ఏడు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాధరావు అన్నారు. మండలంలోని వెంకటభైరిపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలను శుక్రవారం తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటింటికీ ఆరోగ్య సర్వేలో ప్రతి గ్రామ, వార్డు సచివాయంలో ఎఎన్ఎం, ఆశాలు ఒక బృందంగా, సిహెచ్ఒలు, ఆశా కార్యకర్తలు బృందంగా ఏర్పడి ప్రతి ఇంటినీ సర్వే నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఇంటి వద్ద 7 రకాల వైద్య పరీక్షలు - బిపి, మధుమేహం, రక్తహీనత, మూత్రం, మలేరియా, డెంగీ, కఫం పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను తనిఖీ చేసి పేర్ల జాబితా తయారు చేయాలని సూచించారు. ఈ మేరకు గ్రామంలో నిర్వహించిన సర్వేలో ఆయా కుటుంబాలతో ముఖాముఖి మాట్లాడి చేసిన పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న వైద్య శిబిరాలకు ఒపి చీటీలను అవసరమైన అందరికీ అందించాలని ఆదేశించారు.

ఫ్రై డే డ్రై డే పాటించాలి

ప్రతి శుక్రవారం ఇంట్లో ఉన్న నీటి పాత్రలను ఖాళీ చేసి శుభ్ర పరచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గ్రామస్తులకు పిలుపునిచ్చారు. గ్రామంలో పరిశుభ్రత పాటించాలని తద్వారా దోమలు వృద్ధి వ్యాప్తి చెందకుండా ఉంటాయని చెప్పారు. అనంతరం పిహెచ్‌సిలో మందులు, పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **పార్వతీపురం టౌన్ :** ప్రజలకు అత్యుత్తమమైన వైద్యమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు అన్నారు. పట్టణంలో పలు వార్డుల్లో హెల్త్ సెక్రటరీలు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజలకు కావాల్సిన ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం కమిషనర్ జగన్నాధపురంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వైద్యుల పర్యవేక్షణలో ప్రజలకు అన్ని విధాలా వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. హెల్త్ సెక్రటరీలు, వైద్య సిబ్బంది ప్రజలకు పారిశుధ్యం, రక్తదానం, అవయవ దానాలపై అవగాహన కల్పించాలని అన్నారు. **కురుపాం :** మండలంలోని మొండెంఖల్ పిహెచ్‌సి పరిధిలో గల ఉదయపురంలో వైద్యాధికారి బి.ప్రజ్ఞ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని 15 రోజుల ముందు నుండి ఆరోగ్య కార్యకర్త , సిహెచ్ఒ, వాలంటీర్ ముందస్తు గృహ సందర్శన చేస్తూ దీర్ఘకాలిక రోగులను గుర్తించి ప్రత్యేక వైద్య అధికారుల సమక్షంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని, దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు నాగేశ్వరరావు, భారతి, ఆరోగ్య సహాయకులు జె. తిరుపతిరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **పార్వతీపురం రూరల్ :** మండలంలోని బాలగొడబలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో సిహెచ్ఒ, ఆశా, సచివాలయ వాలంటీర్లు, ఎఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక ఎంపీపీ స్కూల్లో అక్టోబర్ 10న జరిగే వైద్య శిబిరంలో రోగులు పాల్గొనేటట్లు చేసి మందులు అందించాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వి.జగదీష్, ఎఎన్ఎం రామలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **గుమ్మలక్ష్మీపురం :** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి శ్యాం కుమార్ కోరారు. మండలంలోని ఇరిడి గ్రామ సచివాలయం పరిధి కన్నయ్యగూడలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సర్వేలో భాగంగా ప్రతి కుటుంబాన్ని ఆరోగ్య సిబ్బందితో పాటు గ్రామ వాలంటీర్లు కలసి సందర్శన చేసి వ్యాధులతో బాధపడుతున్నట్లయినా గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటారని అన్నారు. అలాగే అక్టోబర్ 5న ఇరిడి సచివాలయంలోఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సర్వేలో హెచ్‌వి యర్రాయమ్మ, ఆరోగ్య కార్యకర్తలు ఎస్వీ ప్రకాష్, ఏవి అర్చన, కె.దీపిక, ఎన్.కన్యాకుమారి, ఆశా కార్యకర్త చంద్రావతి, (వాలంటీర్లు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

జెఎఎస్ సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - బెలగాం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్వే శత శాతం పూర్తి చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శుక్ర వారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్వే శత శాతం జరగాలని, ఏడు పరీక్షలు నిర్వహించాలని అన్నారు. వైద్య నిపుణులు, శిబిరాలు మ్యాపింగ్ పక్కాగా చేయాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎంహెచ్ఒ డాక్టర్ బగాది జగన్నాథ రావు, ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎంఎతో సమావేశం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులతో స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ జగన్నాధరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని, దీన్ని విజవయంతం చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఎ జిల్లా అధ్యక్షులు యాళ్ల వివేక్, ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, ప్రోగ్రాం అధికారి డా.నవీన్ కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంపై అనుమానం : టిడిపి

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి సెంటర్ జైల్లో ఉంచారని, ఆయన ఆరోగ్యంపై అనుమానంగా ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా హరిజన విభాగం ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక మాజీ ముఖ్యమంత్రికి జైల్లో ఎటువంటి సదుపాయాలు లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దోమల మధ్య నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఇది కేవలం వైసీపీ ప్రభుత్వ కక్షపూరిత అరెస్టులకు నిదర్శనం అన్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, టిడిపి హరిజన విభాగ నాయకులు ఎ.మహేష్, కె.సుందరరావు, వెంకటరమణ, గవరయ్య, గంగయ్య, ప్రశాంత్, అప్పారావు, పౌల్, ఆనంద్, రమేష్,సుందరరావు పాల్గొన్నారు.
వీరఘట్టం: చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ శుక్రవారం స్థానిక ఎస్‌బిఐ ఆవరణలో టిడిపి మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, జామి సింహాచలం, బల్ల హరిబాబు, మాచర్ల అనిల్‌కుమార్, డి.శ్రీనివాసరావు, కె.అసిరినాయుడు, తదితరులు రిలేనిరాహారదీక్షలు చేపట్టారు. తక్షణమే బాబును విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
పార్వతీపురం రూరల్ : హైకోర్టులో చంద్రబాబుకు న్యాయం జరగకపోయినా సుప్రీం కోర్టులో అంతిమ విజయం సాధిస్తామని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో భాగంగా బాలగొడబలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తమ నాయకుడి ఆరోగ్యం కోసం సింహాచలం వరకు పాదయాత్ర మొక్కులు తీర్చుకోవడానికి వెళుతున్న బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీ నాయనను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని. ఇలాంటి చర్యల వల్ల ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి మువ్వల పాదాల నాయుడు, భాస్కర రావు, జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట నాయుడు, కార్యదర్శి బోను చంద్రమౌళి, బార్నాల సీతారాంతో పాటుగా జనసేన నాయకులు పాల్గొన్నారు. **భామిని :** మండల కేంద్రంలో బాబుతో మేము కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు నల్ల కండువాలు ధరించి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలనుద్దేశించి పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకష్ణ మాట్లాడుతూ చంద్రబాబు బయటకు వచ్చేంత వరకు దీక్షలు కొనసాగించాలని, భవిష్యత్తులో వైసిపి పతనం కాయమని, టిడిపి గెలుపు తథ్యమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, భూపతి ఆనందరావు, అంపిలి కేశవ, బిడ్డికి ప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు రుంకు కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు నిమ్మక నిబ్రం, బిడ్డికి ప్రసాద్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న టిడిపి నాయకులు

బేబినాయన అరెస్టుపై రాస్తారోకో

ప్రజాశక్తి - సీతానగరం

చంద్రబాబునాయుడు విడుదల కావాలని కోరుతూ బొబ్బిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బేబినాయన ఈనెల 22 నుంచి చేపట్టిన పాదయాత్ర అడ్డుకునేందుకు శుక్రవారం పోలీసులు ఆయన్ను అరెస్టులు చేశారు. దీనికి నిరసనగా స్థానిక హనుమాన్ జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు ఆర్.వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ అక్రమంగా అరెస్టు చేసిన బేబినాయుడును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.హరి గోపాలరావు, ఎస్.శ్రీనివాసరావు, వి.సూర్యనారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : బేబీ నాయనను బలవంతంగా తీసుకెళ్లి అరెస్టు చేయడం దారుణమని టిడిపి పట్టణ నాయకులు మజ్జి కృష్ణమోహన్, వెంకటేష్ ఖండించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు విడుదల కావాలని బేబినాయన తన మొక్కును తీర్చుకునేందుకు బొబ్బిలి నుండి సింహాచలం వరకు పాదయాత్ర చేసే సమయంలో పోలీసులు ఆయన కోటకు వెళ్లి బలవంతంగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని, అన్నారు. ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పి, టిడిపిని గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సాహితీ యోధుడు గురజాడ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

చిరస్మరణీయ గొప్ప సాహిత్య యోధుడు గురజాడ అని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. మహాకవి గురజాడ జయంతి సందర్భంగా శుక్రవారం అరసం ఆధ్వర్యంలో జిల్లా శాఖ స్థానిక వేదాంత కళాశాలలో ఏర్పాటు చేసిన ఈతరం కోసం కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నేటి సమాజానికే కాదు రాబోయే కొత్త తరానికి కూడా ఆయన రచనలు స్ఫూర్తినిస్తాయని అన్నారు. ఒక సాహిత్యవేత్త గానే కాక, ఒక సంఘ సంస్కర్తగా ఆయన మానవ సమాజ ప్రగతికి అడుగు జాడ అని కొనియాడారు. అరసం జిల్లా అధ్యక్షులు చింతా అప్పలనాయుడు అధ్యక్షత సభకు వహించారు. పుస్తకాన్ని ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు ఆవిష్కరించారు. ఇప్పటి విద్యార్థి తరం గురజాడను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని, ఆయన తన రచనల్లో చూపిన జ్ఞాన చైతన్యాన్ని పెంపొందించుకొని, సమాజ హితానికి పాటు పడాలని ఆయన ఉద్బోధించారు. పుస్తక సంపాదకులు జిఎస్ చలం మాట్లాడుతూ విద్యతో పాటు పుస్తక అధ్యయనం కూడా విద్యార్థులు తప్పక పాటించాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో అరసం జిల్లా కార్యదర్శి పాలకొల్లు రామలింగస్వామి ఆహ్వానం పలకగా పల్ల రోహిణి కుమార్ వందన సమర్పణ చేశారు. రచయితలు స్వామి నాయుడు, మల్లిపురం జగదీశ్, పారినాయుడు, సింహాచలం, తదితరులు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

డిటికి వినతిని అందజేస్తున్న జనసేన నాయకులు

రోడ్డుకు మరమ్మతులు చేస్తారా? మమ్మల్ని చేసుకోమంటారా?

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బత్తిలి -అలికాం ప్రధాన రహదారిపై పలు చోట్ల గోతులు మయంగా మారి, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతుంటే, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సబబు కాదని జనసేన నాయకులు రుంకు కిరణ్ కుమార్, నిమ్మక నిబ్రం, కర్రీ ఢిల్లేశ్వరావు, రవి నాయుడు, వైకుంఠ రాజు, నాగరాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్ శేఖరంకు వినతిని అందజేశారు. తక్షణమే రోడ్డును మీరు బాగు చేయిస్తారా? లేకుంటే మమ్మల్లే చేయించుకోమంటారని ప్రశ్నించారు. 15 రోజుల్లో రోడ్డు మరమ్మతులకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకోకపోతే, మాకు అనుమతి ఇస్తే సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతులు చేస్తామని స్పష్టం చేశారు.

కార్మికుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యం విడనాడాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఎపి ఫైబర్స్ జ్యూట్ మిల్లు యాజమాన్యం కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యాన్ని విడనాడి, మిల్లు తెరిచేందుకు కృషి చేయాలని జ్యూట్ మిల్లు కార్మిక జెఎసి వెల్లడించింది. మండలంలోని జీగిరాం జ్యూట్ మిల్లు కార్మికులు 32వ రోజు దీక్షా శిబిరం వద్ద జెఎసి నాయకులు కె.శ్రీనివాసరావు, ఎన్‌వై నాయుడు, సింహాచలం, సూరప్పలనాయుడు మాట్లాడుతూ ఎసిఎల్, జెసిఎల్ సమక్షంలో చర్చలు జరిగితే యాజమాన్యం సహకరించకపోవడమంటే, కార్మిక ఆందోళనను లెక్కచేయకపోవడమే అవుతుందని అన్నారు. ఇలాంటి వైఖరి యాజమాన్యం తీసుకుంటే, భవిష్యత్తులో జరిగే ఆందోళన, పోరాటాలకు, యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్మిక వర్గం ఓపికతో శాంతియుతంగా ఆందోళన చేస్తుందని, ప్రభుత్వం, యాజమాన్యం మిల్లు తెరవడానికి కృషి చేయాలని, లేకుంటే భవిష్యత్తులో జరిగే తీవ్ర ఆందోళనకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొరకు కార్మిక సమస్యలు పరిష్కారం చేయాలని జెసిఎల్‌కు లేఖ రాయడం జరిగిందని, ఆ లేఖను కూడా యాజమాన్యం పట్టించుకోలేని పరిస్థితి నెలకొందని ఇది నిర్లక్ష్యమే అవుతుందనినాయకులు తెలిపారు. కార్మిక జెఎసి పోరాటానికి అన్ని పక్షాలు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు సుదర్శన్, సింహాచలం పాల్గొన్నారు.

కార్మికుల దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న జెఎసి నాయకులు

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 23 నుండి స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ దశల వారీగా జాతీయ నూతన విద్యా విధానంపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. విద్యను సులభంగా, సృజనాత్మకం గా, వినూత్నంగా విద్యార్థులకు బోధించేందుకు అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

కమిషనర్‌ను కలిసిన టౌన్ సిఐ

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమితులైన టి.జయరాంను టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఆయన్ను కలిసిన సిఐ శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టణ సమస్యల పరిష్కారానికి సహకరించాలని సిఐ శ్రీనివాసరావును కోరారు.

సిడిపిఒకు వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ సిడిపిఒ బి.సత్యవతికి వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షులు బి.రాధ ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక ఏళ్లుగా అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్నారన్నారు. తెలంగాణా రాష్ట్రంలో కంటే ఎక్కువ వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రిటైర్మెంట్ సదుపాయాలు కల్పించాలన్నారు. ఫేషియల్ రికగ్నిషన్ యాప్ రద్దు చేయాలని కోరారు. మినీ అంగన్వాడీ కార్యకర్తలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, హెల్పర్స్ యూనియన్ నాయకులు జ్యోతి, అరుణ పాల్గొన్నారు.

వీరఘట్టంలో ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టంలో అక్రమ ఇసుక రవాణా గత కొద్దిరోజుల నుంచి జోరుగా సాగుతోంది. ఒట్టిగెడ్డలోని ఇసుకను నాటుబళ్లతో తీసుకొచ్చి శ్రీ ధర్మశాస్త్ర సమాజం వద్ద నిల్వ ఉంచి రాత్రి సమయంలో వాహనాల ద్వారా తరలిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. నాటు బండి ఇసుక రూ.600 చొప్పున తరలించి, ట్రాక్టర్ రూ.8వేలకు ఇసుక విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం. అయితే వీటిపై అధికారులు దృష్టిసారించకపోవడంతో అక్రమ రవాణాదారులు మూడు పువ్వులు, ఆరు కాయలుగా చేతుల నిండా డబ్బులు సంపాదిస్తున్నట్లు వినికిడి. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల వల్ల వరదలు రావడంతో ఒట్టిగడ్డ ఇసుక తవ్వకాల వల్ల గోతులు ఏర్పడడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల వట్టిగెడ్డలో ఉదయాన గౌరమ్మ, గొడబ సంజీవ మృత్యువాత పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



నాటుబండ్ల తీసుకొచ్చి నిల్వ ఉంచిన ఇసుక దిబ్బలు